# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో కాలుష్యాన్ని నికర స్థాయికి తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **తెలంగాణలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పథకం కింద 304 కోట్ల రూపాయలను విడుదల చేశామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.**

3. **రైతుల సంక్షేమమే లక్ష్యంగా 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**

4. **విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు.**

5. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంచనాల కమిటీ ఈరోజు నుంచి ఈ నెల 29వ తేదీ వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనుంది.**

==========================

ఆంధ్రప్రదేశ్ లోని అన్ని ప్రాంతాల్లో కాలుష్యాన్ని నికర స్థాయికి తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కాలుష్య నియంత్రణ మండలిపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అన్ని రకాల ప్లాస్టిక్ వ్యర్థాలను నాశనం చేసేందుకు ఒక విధాన పరమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ. ఏక వినియోగ ప్లాస్టిక్ వాడకం తగ్గించేలా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గాలి నాణ్యతను అన్ని కోణాల్లో విశ్లేషించేందుకు నూతన సాంకేతికతను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

-------------------------

తెలంగాణలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పథకం కింద 304 కోట్ల రూపాయలను విడుదల చేశామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సహాయక సంఘాలకు నిధుల పంపిణీపై హైదరాబాద్ నుంచి జిల్లా గ్రామీణాభివృద్ధి విభాగం అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, మహిళల అభివృద్ధికి దోహదం చేసే పథకాలను అమలు చేస్తున్నామన్నారు. వడ్డీలేని రుణాల పథకం ద్వారా 3లక్షల 5 వేల 98 సంఘాలు లబ్ధి

పొందనున్నాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు సంబంధిత చెక్కులను జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈరోజు నుంచి పంపిణీ చేయాలని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

రైతుల సంక్షేమమే లక్ష్యంగా 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. కృష్ణా జిల్లా ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు వంటి అంశాలపై ఈనెల 29 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రైతుల కోసం ప్రత్యేకంగా వ్యవసాయ యాప్ అందుబాటులోకి తెచ్చామని, అందరూ ఈ యాప్‌ను వినియోగించుకోవాలని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ 33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాయలసీమ ప్రాంత అభివృద్ధిపై అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల సాగు నుంచి సంపద సృష్టి చేయవచ్చన్నారు. రాయలసీమ జిల్లాలలో పారిశ్రామికాభివృద్ధితో పాటు ఉద్యాన పంటల సాగు పెరగాలన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు ఉద్యాన పంటలకు ప్రాధాన్యమిచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

గోవాలో నిర్వహిస్తున్న 56వ అంతర్జాతీయ భారత చలనచిత్రోత్సవం–ఇఫీలో భాగంగా ప్రపంచ సహకారం, సృజనాత్మక మార్పిడి, సినిమా ఆవిష్కరణల కోసం నిర్వహించిన "వేవ్స్ ఫిల్మ్ బజార్ 2025" నిన్నటితో ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిత్రనిర్మాతలు, ఔత్సాహిక సినిమా నిపుణులు పాల్గొని నూతనంగా ఉద్భవిస్తున్న చిత్ర సాంకేతికను తెలిపే పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. వేవ్స్ ఫిల్మ్ బజార్ 20వ ఎడిషన్‌ను వచ్చే ఏడాది మరింత విస్తరిస్తామని ఫిల్మ్స్ జాయింట్ సెక్రటరీ అజయ్ నాగభూషణ్ ప్రకటించారు.వేవ్స్ ఫిల్మ్ బజార్ ముగింపు వేడుకలో చిత్ర నిర్మాణం, స్క్రిప్ట్ అభివృద్ధి, ఏఐ ఫిల్మ్ విభాగాలలో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులను ప్రదానం చేశారు.

---------------------------

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విలువల విద్య' సదస్సులో ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావుతో కలిసి మంత్రి నిన్న పాల్గొన్నారు. పిల్లల్ని సరైన మార్గంలో పెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఇందుకు రాష్ట్రంలో ఒక తరగతి ఒక ఉపాధ్యాయుడు విధానాన్ని అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా నారా లోకేష్

తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

-------------------------

తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర పర్యావరణ, అటవీశాఖ కార్యదర్శి తన్మయ్‌కుమార్‌ను కోరారు. ఢిల్లీలో ఆయనను కలిసి నిన్న వినతిపత్రం సమర్పించారు. ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేస్తే ప్రజలకు తాగు, సాగునీరు అందించే అవకాశాలు పెరుగుతాయని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తన్మయ్‌కుమార్ స్పందిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఆధారంగా న్యాయ సలహాలు తీసుకొని ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంచనాల కమిటీ ఈరోజు నుంచి ఈ నెల 29వ తేదీ వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనుంది. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఛైర్మన్ వి.జోగేశ్వరరావు అధ్యక్షతన పలువురు శాసనసభ్యులు గల కమిటీ ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటిస్తుంది. ఈ సందర్భంగా 2020, 21, 22 ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షిస్తారు. ఈ రోజు విశాఖపట్నం, రేపు విజయనగరం, ఎల్లుండి శ్రీకాకుళంలో రాష్ట్ర అంచనాల కమిటీ బృందం పర్యటించనుంది.

-------------------------

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కార్మిక చట్టాల పట్ల కార్మిక సంఘాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. ఈ చట్టాల ద్వారా కార్మికులకు వేతనం, అధిక పనిగంటలు వంటి అంశాలు మరింత సరళీకృతం చేశారని విశాఖపట్నానికి చెందిన కార్మిక నాయకులు తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

-------------------------

మలక్కా జలసంధి సమీపంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని, ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఈరోజు వాయుగుండంగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొంటూ..

వాయిస్...21 సెకన్లు

తెలంగాణాలోనూ రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

====================